
సాక్షి ఖమ్మం

బుధవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2023



తెగుళ్లతో మిర్చి రైతుల కుదేలు

ఈ ఏడాది మిర్చి పంటకు సోకుతున్న తెగుళ్లతో పెట్టుబడి పెరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 10లో



పట్టుబడుతున్న నగదు

ఎన్నికల కోడ్ నేపథ్యాన పోలీసులు చేపట్టిన తనిఖీల్లో వివిధ చోట్ల రూ.7.37లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం

36° / 24°

వాతావరణం

పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం మంచు కురిసే అవకాశముంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.



కేసీఆర్ సమరశంఖం

ఉమ్మడి ఖమ్మం గుమ్మంలో ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ ఎన్నికల సమరశంఖం పూరించబోతున్నారు. వరుస పర్యటనలతో ప్రచారాన్ని హోరెత్తించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెల 27న పాలేరు నియోజకవర్గంలో, వచ్చేనెల 1వ తేదీన సత్తుపల్లి, ఇల్లెందులో, ఆ తర్వాత 5వ తేదీన కొత్తగూడెం, ఖమ్మంలో నిర్వహించే సభలకు కేసీఆర్ హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్కో స్థానమే దక్కింది. గత పరిస్థితులను బేరీజు వేసుకుని ఈసారి మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారంపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతోపాటు ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకునేలా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

గతం పునరావృతం కాకుండా..

2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పరాభవమే మిగిలిందని చెప్పాలి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం, రెండో ఎన్నికల్లో ఖమ్మం స్థానమే దక్కింది. అయితే, రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మారిన రాజకీయ సమీకరణాలతో మధిర, భద్రాచలం మినహా కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు గులాబీ గూటికి చేరారు. దీంతో ప్రజాప్రతినిధుల పరంగా బలం పుంజుకుంది. ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవి తాతా మధుకు ఇవ్వడంతోపాటు రాజ్యసభకు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డిని పంపారు. దీంతో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి చట్టసభల్లో పార్టీ ప్రాతినిధ్య బలం పెరిగింది. ఇలా అన్ని కోణాల్లో పార్టీ బలోపేతమైన నేపథ్యాన గత పరిస్థితులు పునరావృతం కాకుండా ఈసారి మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది.

ఉమ్మడి జిల్లా సభల్లో పాల్గొననున్న గులాబీ బాస్

- ఈనెల 27న పాలేరు నుంచి షురూ
- వచ్చేనెల 1న సత్తుపల్లి, ఇల్లెందులో పర్యటన
- 5వ తేదీన కొత్తగూడెం, ఖమ్మంలో సభలు
- భారీగా జన సమీకరణతో నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు

పాలేరు నుంచి పొలికేక

ఉమ్మడి జిల్లాలో పాలేరు నియోజకవర్గం నుంచే గులాబీ బాస్ ప్రచార పొలికేకకు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 27న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు పాలేరు నియోజకవర్గంలో నిర్వహించే సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారు. అనంతరం వచ్చేనెల 1న సత్తుపల్లి నియోజకవర్గంలో మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటల వరకు, ఇల్లెందు నియోజకవర్గంలో రెండు నుంచి మూడు గంటల వరకు జరిగే సభల్లో సీఎం పాల్గొంటారు. నవంబర్ 5న కొత్తగూడెం, ఖమ్మంలో మధ్యాహ్నం జరిగే సభలకు కేసీఆర్ హాజరై ప్రసంగించనున్నారు. మొత్తంగా నవంబర్ మొదటి వారానికే ఐదు నియోజకవర్గాలను కేసీఆర్ చుట్టేయనుండగా, నవంబర్ రెండో వారంలో మిగతా చోట్ల సభలకు గులాబీ బాస్ హాజరవుతారు.

ప్రచారంలో దూకుడు

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి ఇప్పటికి యాభై రోజులు దాటింది. అభ్యర్థులు ఇప్పటికే రెండేసి సార్లు నియోజకవర్గాల్లో పర్యటించారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఖమ్మం, సత్తుపల్లిల్లో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై ఘాటైన విమర్శలు చేయడమేకాక బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, అభివృద్ధి చేసిన తమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందునుంచే బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకెళ్తుండగా... ముఖ్యమంత్రి కేసీఆర్ సభలతో అభ్యర్థుల్లో నూతనోత్తేజం వస్తుందని నాయకత్వం భావిస్తోంది.

కేసీఆర్ మాటలే అస్త్రాలుగా..

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఏడాది జనవరి 18న ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు హాజరయ్యారు. కేసీఆర్‌తోపాటు పంజాబ్, ఢిల్లీ, కేరళ ముఖ్యమంత్రులు ఈ సభకు హాజరైన విషయం విదితమే. టీఆర్ఎస్ ఆవిర్భావం, బీఆర్ఎస్‌గా రూపాంతరం, తెలంగాణ ఉద్యమ నేపథ్యాన ఖమ్మం వేదికగా ఆయన చెప్పారు. గత రెండు ఎన్నికల్లో ఏర్పడిన లోటును పూడ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆవిర్భావ సభను ఇక్కడ నిర్వహించినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత అకాల వర్షాలతో పంటలు దెబ్బతినగా బోనకల్ మండలంలో కేసీఆర్ పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. ఇక ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలకు వస్తున్న ఆయన ఇవ్వనున్న హామీలు, చేసే ప్రసంగం హాట్ టాపిక్ అవుతుందని భావిస్తున్నారు. కేసీఆర్ ప్రసంగమే పార్టీ అభ్యర్థుల గెలుపునకు మార్గం సుగమం చేయనుందనే విశ్లేషణ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

న్యూస్‌రీల్


ప్రతీ చుక్కా సాగుకు ఉపయోగపడాలి



రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: సాగర్ డ్యాంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ ఆయకట్టు రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులు నీటిని విడుదల చేశారని, ఇందులో ప్రతీ చుక్క సాగుకు ఉపయోగపడేలా అధికారులు పర్యవేక్షించాలని జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ సూచించారు. కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుండి జలాలు వస్తుండగా నాయకన్‌గూడెం సమీపాన ఇన్‌ఫాల్ రెగ్యులేటరీ, దిగువకు నీరు విడుదల చేస్తుండగా ఔట్‌ఫాల్ కాల్వను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఇంజనీర్లతో సమావేశమైన సీఈ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ఎక్కడా అవాంతరం ఎదురుకాకుండా నీరు పొలాలకు చేరేలా పర్యవేక్షించాలని సూచించారు. నిత్యం పర్యవేక్షిస్తూ రైతులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ఈసమావేశంలో ఎస్ఈ నర్సింగరావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ మధు తదితరులు పాల్గొన్నారు.

13న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 13న ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్, యోగా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, స్టెల్లా తెలిపారు. అండర్–14 నుంచి అండర్–17 కేటగిరీల్లో జరిగే పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 9, 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఇంటర్ చదువుతున్న వారైతే 10వ తరగతి మెమో, కాలేజీ నుంచి తీసుకున్న స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 80199 52592, 96527 17716 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పెద్దాస్పత్రిలో విచారణ

ఖమ్మం వైద్యవిభాగం: హైదరాబాద్ నుండి వచ్చిన బృందం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేపట్టింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ కోసం వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం నుండి బృందం సభ్యులు మంగళవారం వచ్చారు. ఫిర్యాదులోని అంశాల ఆధారంగా సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావును ప్రశ్నిస్తూ ఔట్ సోర్సింగ్, పరిపాలన, నిధుల వినియోగం, నియామకాలపై వివరాలు ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీసీహెచ్ఎస్ కార్యాలయం వెళ్లిన అధికారులు అక్కడ రికార్డులను తనిఖీ చేశారు.

గుణాత్మక విద్యతో విద్యార్థులకు మేలు



కొణిజర్ల : విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

కొణిజర్ల/చింతకాని: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యనందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు హాజరు నమోదు యాప్, యూడైస్ ప్లస్‌పై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తక్షణమే విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమదు చేయాలని సూచించారు. అలాగే, బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆతర్వాత కొణిజర్ల మండలం రామనరసయ్యనగర్, మల్లుపల్లిల్లోని పాఠశాలల్లో తనిఖీ చేసిన డీఈఓ విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఇక చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన హెచ్ఎంల సమావేశంలో కూడా డీఈఓ పాల్గొని సూచనలు చేశారు. యూడైస్ ప్లస్ ఇన్‌చార్జ్ భానుప్రకాష్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్‌తో పాటు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి..

- జిల్లాలో కొత్తగా 63 పోలింగ్ కేంద్రాలు
- 390 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- తుపాకులు డిపాజిట్ చేయాలని సమాచారం ఇచ్చాం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అధికారులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతోనే కోడ్ అమలులోకి వచ్చింది. ఇప్పుడు ప్రజల చేతుల్లోనే పవర్ ఉంది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. గత ఎన్నికల్లో జిల్లాలో 90 శాతం వరకు పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగేలా అవగాహన కల్పిస్తున్నాం... అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీ.పీ. గౌతమ్ తెలిపారు. సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి ఆయన జెడ్పీ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లోని రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపు, విగ్రహాలకు ముసుగు కప్పడం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో సభలు, సమావేశాల నిర్వహణ, సొంత ఖర్చులతో హోర్డింగ్స్ పెట్టుకోవాలనుకునే వారు మున్సిపాలిటీల్లో అనుమతి తీసుకోవాలని సూచించారు. ఖమ్మంకు మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, వైరాకు అదనపు కలెక్టర్, సత్తుపల్లికి కల్లూరు ఆర్డీఓ, మధిరకు ఖమ్మం ఆర్డీఓ, పాలేరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ఓలుగా వ్యవహరిస్తారని చెప్పారు. డబ్బు, మద్యం పంపకంపై సమాచారం ఇచ్చేందుకు ఎన్నికల కమిషన్ సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. కాగా, కొత్త కోడళ్లు తమ పుట్టింటి నుంచి ఓటు హక్కును అత్తింటి వద్దకు మార్చుకోవడానికి ఫామ్–18ను దరఖాస్తు చేసుకోవాలని, వృద్ధులు ఇంటి నుంచి ఓటు వేసుకునే హక్కు ఉందని చెప్పారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రతీ నియోజకవర్గంలో ఐదు మోడల్‌పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు.

జింకలతండా గోదాంలో లెక్కింపు

వచ్చేనెల 30న పోలింగ్ ముగిశాక ఈవీఎంలను రఘునాథపాలెం మండలం జింకలతండాలోని గోడౌన్‌కు తరలిస్తామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. జిల్లాలో గతంతో పోలిస్తే 63 పోలింగ్‌కేంద్రాలు పెరగగా, ఓటర్లకు ఇబ్బంది రాకుండా అన్ని ఆవాసాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీపీ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ సోమవారం జిల్లావ్యాప్తంగా రూ.53 లక్షలు సీజ్ చేసి 17 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో 10 వేల మందిని బైండోవర్ చేయగా, ఈసారి వారంలోగా ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఇక జిల్లాలో 131 మంది గన్ లైసెన్స్ కలిగి ఉండగా.. 128 మంది వద్ద తుపాకులు ఉన్నాయని చెప్పారు. వీరిలో బ్యాంక్ లైసెన్స్‌దారులు మినహా మిగతా వారు డిపాజిట్ చేయాలని సూచించినట్లు తెలిపారు. జిల్లాలో 390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లుచేయనున్నట్లు చెప్పారు.

కొత్త జాబితాలో తొలగింపులు ఉండవు..

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల నియమావళిని అన్ని పార్టీలు తప్పక పాటించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సీపీ వారియర్‌తో కలిసి సమావేశమైన ఆయన మాట్లాడారు. కొత్తగా ఓటరు జాబితాలో తొలగింపులకు అవకాశం లేకపోగా, అర్హులు ఉంటే పేర్ల నమోదుకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వ్యయ పర్యవేక్షణ అమలు కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అనుమానాస్పద లావాదేవీలపై రిటర్నింగ్ అధికారులకు బ్యాంకర్లు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వైన్స్‌లో అమ్మకాలకు సంబంధించి గత మూడు నెలల నివేదిక సేకరించాలన్నారు.

ఎంసీఎంసీ ప్రారంభం

కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ – మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సెల్‌ను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ ప్రారంభించారు. ఎన్నికల సంబంధ వార్తలపై నిఘా వేయడమే కాక ఫిర్యాదులపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు ఏర్పాటుచేసిన ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలకు కేటాయించిన వాహనాలను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో 15 ఫ్లయింగ్ స్క్వాడ్, 24 ఎంసీసీ, 15 ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటుచేశామని, ఈ బృందాలు షిఫ్ట్‌ల వారీగా 24గంటలు పనిచేస్తాయని తెలిపారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, వ్యయ పర్యవేక్షణ జిల్లా నోడల్ అధికారి సాయికుమార్, డీటీఓ కిషన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, డీసీఓ విజయకుమారి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఏసీపీ గణేష్, డీఆర్డీఓ విద్యాచందన, సీపీఓ ఏ.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, డీపీఆర్వో ఎం.ఏ.గౌస్, ఏపీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

1950, 90632 11298 నంబర్లతో కంట్రోల్‌రూం

ఎన్నికల నేపథ్యాన కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ పరిశీలించారు. ఏ ఫిర్యాదు ఏ అధికారికి అందజేయాలో చార్ట్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఓటర్లు తమ ఫిర్యాదులను 1950, 90632 11298 నంబర్లకు ఇచ్చేలా ప్రచారం చేయాలని తెలిపారు.

దసరాకు 695 ప్రత్యేక బస్సులు

- రీజియన్‌లో ఆరు డిపోల నుంచి ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన ఆర్ఎం వెంకన్న



ఖమ్మం మామిళ్లగూడెం: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా స్వస్థలాలకు వెళ్లివచ్చే వారి కోసం ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల నుండి 695 ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈమేరకు బస్సుల వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ఈనెల 13నుండి ప్రత్యేక బస్సులు మొదలవుతాయని తెలిపారు.

ఎక్కడి నుంచి ఎన్ని...

రీజియన్‌లో ఖమ్మం డిపో నుండి 230 బస్సులు, మధిర డిపో నుండి 75, సత్తుపల్లి డిపో నుండి 86, భద్రాచలం డిపో నుండి 141, కొత్తగూడెం డిపో నుండి 80, మణుగూరు డిపో నుండి 83 బస్సులు నడిపిస్తామని వెల్లడించారు. గత ఏడాది దసరాకు 655 బస్సులు నడపగా, ఈసారి అదనంగా 40 బస్సులు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక రద్దీకి అనుగుణంగా సర్వీసులు మరిన్ని పెంచుతామని ఆర్ఎం చెప్పారు.

నిత్యం అందుబాటులో...

ప్రధానంగా ఖమ్మం–హైదరాబాద్ మార్గంతో పాటు ఖమ్మం నుండి మణుగూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు తదితర ప్రాంతాలకు బస్సులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. ఇందులో కొన్ని బస్సులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించగా... బస్టాండ్లలో టిక్కెట్ కౌంటర్లలో లేదా ఏటీబీ ఏజెంట్ వద్ద రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆర్ఎం తెలిపారు. కాగా, ప్రయాణికుల పూర్తి వివరాల కోసం హైదరాబాద్ ఎంజీబీఎస్(99594 46673), ఎల్బీనగర్(94939 77790), ఖమ్మం కొత్త బస్టాండ్ (99592 25979)లో సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడమేకాక సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పన్నుల లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలి

వాణిజ్య పన్నుల శాఖ జేసీ శ్రీనివాసరెడ్డి



జేసీ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వాణిజ్య పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో లక్ష్యాలను సాధించాలని శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఆయన మంగళవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వాణిజ్య పన్నుల విభాగం డిప్యూటీ కమిషనర్ హనుమాండ్లుతో కలిసి జిల్లాలోని వివిధ సర్కిళ్ల అధికారులతో సమీక్షించారు. నెలల వారీగా వసూళ్లను పూర్తిచేయగలిగితే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. అలాగే, పాత బకాయిలకు సంబంధించి వస్తు సేవా పన్ను వడ్డీ, పేరుకుపోయిన వడ్డీ బకాయిల వసూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఖమ్మం సర్కిల్–1, 2, 3 వాణిజ్య పన్నుల విభాగం అధికారులు భాస్కర్, ధనలక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు. కాగా, జాయింట్ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డిని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు సోమా నరసింహారావు, మన్నెం కృష్ణ తదితరులు కలిశారు. అలాగే, జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బిదుర్గాప్రసాద్‌రావుతో ఆపటు కె.రామకృష్ణ, కె.పవన్ కుమార్, ఉల్లిబోయిన సైదులు, జి.రమేష్, ఏ.రమేష్‌బాబు తదితరులు కూడా జాయింట్ కమిషనర్‌ను సన్మానించారు.

సర్వం సర్వేమయం!



పార్టీలతో పాటు ఆశావహుల సర్వేలు

- బలాబలాలు తెలుసుకునేందుకు నిర్వహణ
- నివేదికల ఆధారంగా ఎన్నికల రంగంలోకి...
- పొరపాటున నోరుజారితే ఫలానా పార్టీ వ్యక్తిగా ముద్ర!

సత్తుపల్లి: ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక మొదలు బలాబలాలు తెలుసుకునేందుకు సర్వే చేయించుకోవడం పరిపాటిగా మారింది. సర్వేల్లో వచ్చిన ఫలితాలను సమీక్షించుకుంటూ ఎక్కడ బలహీనంగా ఉన్నామో సరిచేయించుకోవడంలో ఆశావహులు నిమగ్నమయ్యారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు, ఆశావహులు నెలకు రెండు, మూడు సార్లు సర్వే చేయించుకుంటూ గెలుపోటములను బేరీజు వేసుకుంటున్నారు. ఫలానా పార్టీ, ఫలానా అభ్యర్థి బలం గత నెలలో ఇలా ఉండగా.. ఈసారి పెరిగింది, లేదంటే తగ్గింది అని ఎదుటి వర్గం వారు ప్రచారం చేస్తున్నారు. ఇక సొంత పార్టీల వారైతే తమ అభ్యర్థి, నేత బలం పెరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ఎన్నికల రంగంలో దూసుకెళ్తున్నారు.

సొంత సర్వేలతో బిజీ

ఒక్కో రాజకీయ పార్టీ ఒక్కో సంస్థకు సర్వే బాధ్యతలను అప్పగించింది. అయితే, పోటీ చేసే అభ్యర్థులు సైతం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీ నుంచి ఫలానా అభ్యర్థి పోటీకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది.. అధికార పార్టీ అభ్యర్థి అనుకూల అంశాలు ఏమిటి... పోటీలో ఎవరెవరు ఉంటారు, ఎవరికి గెలిచే అవకాశముందందనే అంశాలపై సర్వే చేయిస్తూ నివేదికలు తెప్పించుకుంటున్నారు.

సమాచారం ఉంది...

సర్వే చేయించుకున్న నేతలు ఏ గ్రామంలో ఏ పార్టీ, ఏ నాయకుడికి ఎంత ఇమేజ్ ఉందో తెలుసుకుంటున్నారు. అనంతరం ఆ గ్రామానికి వెళ్లినప్పుడు సమాచారం తన వద్ద ఉందని చెబుతూ సర్వే చేసిన వారికి ఎవరెవరు ఏం చెప్పారో కూడా తెలుసు.. ఇకనైనా సీరియస్‌గా పని చేయకపోతే ఫలితాలు మారనున్నందున తీరు మార్చుకోవాలని సూచనలు చేస్తున్నట్లు తెలిసింది.

జర జాగ్రత్త

సర్వే కోసం ఎవరైనా వస్తే వారు అడిగిన ప్రశ్నలకు ఇష్టముంటే సమాధానం చెప్పడం లేదంటే దాటవేయడమే మంచిదని పలువురు సూచిస్తున్నారు. అలాకాకుండా ఏదో ఒక మాట అంటే సరిపోతుందిగా అనే భావనతో సమాధానమిస్తే సదరు వ్యక్తి ఫలానా పార్టీకి అనుకూలమనే ముద్ర వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక నలుగురు కూడిన చోట రాజకీయాలపై చర్చించడం.. అదికాస్తా పెద్దదై నిందించుకోవడం ఇటీవల సాధారణమైందని తెలుస్తోంది. ఎవరైనా అతి ఉత్సాహంతో మాట్లాడితే సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సంబంధిత నాయకులకు చేరవేస్తున్నట్లు సమాచారం.

ప్రామాణికత ఉందా?

ఒకప్పుడు సర్వేలకు ప్రాధాన్యత ఉండగా.. నివేదికలకు ఒక కచ్చితత్వం ఉంటుందని నమ్మేవారు. కానీ రానురాను ఏ పార్టీకి ఆ పార్టీ అనుకూలంగా సర్వే నివేదికలు వస్తుండడంతో ప్రజలు విశ్వసించడం లేదు. సర్వే చేయించిన వ్యక్తికి అనుకూలంగా నివేదిక ఇవ్వకపోతే ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందనే భావనతో నిర్వాహకులు అదే మాదిరి చేస్తున్నట్లు సమాచారం. ఇక 2019లో ఏపీలో జరిగిన ఎన్నికల్లో ఓ సంస్థ ఇచ్చిన సర్వే నివేదిక ఆధారంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు పందేలు కాసి భారీగా నష్టపోయి ఇప్పటికీ కోలుకోలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయి మానసికంగా కుంగిపోయిన వారు పలువురు కనిపిస్తారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం నిర్వహించారు. ఆతర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు.

నేటి నుంచి 'సింగరేణి'

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వేస్టేషన్ నుంచి సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైలు తాత్కాలికంగా రద్దు చేయగా, ఆ తర్వాత పొడిగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు బుధవారం నుంచి రైలు మొదలవుతుందని అధికారులు వెల్లడించగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సిర్పూర్‌కాగజ్‌నగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు మంగళవారం రాత్రి కొత్తగూడెం స్టేషన్‌కు చేరుకుని ఉదయం తిరిగి బయలుదేరుతుంది.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న సాయిరాహుల్

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ రామాలయ అభివృద్ధికి బోనాల శ్రీసాయి రాహుల్ మంగళవారం రూ.40,116 విరాళం అందించారు. బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించగా, మొదటి నెల వేతనాన్ని ఆలయ అభివృద్ధి కోసం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆలయ చైర్మన్ కొప్పుల వెంకటకృష్ణ, కార్యదర్శి బోనాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బీకేఎంయూ మహాసభల ప్రతినిధిగా ఆదినారాయణ



ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ మహాసభలు నవంబర్ 2నుంచి 5వ తేదీ వరకు బీహార్ రాజధాని పాట్నా నగరంలో జరగనున్నాయి. ఈ సభకు ప్రతినిధిగా సత్తుపల్లికి చెందిన దండు ఆదినారాయణ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన బీకేఎంయూ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు కనీస వేతనం, విద్య, వైద్యం, ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

యువకుడికి బీసీ బంధు చెక్కు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్లకు చెందిన చల్లా వెంకటేశ్వర్లు పేరు జాబితాలో ఉన్నా బీసీ బంధు చెక్కు ఇవ్వకపోవడంతో ఆయన సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన విషయం విదితమే. అయినా అధికారులు స్పందించకపోవడంతో కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో విషయాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ దృష్టికి తీసుకెళ్లగా ఆమె సూచనతో వెంకటేశ్వర్లుకు ఎంపీడీఓ చెక్కు అందజేశారు.

పొదల్లో నవజాత శిశువు

ఆస్పత్రికి తరలించిన స్థానికులు

వైరా/కొణిజర్ల: ఇంకా కళ్లు కూడా తెరవని మగ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదల్లో వదిలేసి వెళ్లారు. వైరా మున్సిపాలిటీ శివారు దిద్దుపూడికి చెందిన ఓ మహిళ మగళవారం వైరా వైపు వస్తుండగా ఎస్సీ కాలనీ దాటాక పొదల్లో మెత్తని బట్టలో చుట్టిన శిశువు కనిపించింది. దీంతో ఆమె దిద్దుపూడి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వారు వైరా పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ డాక్టర్ ఉదయలక్ష్మి శిశువుకు ప్రాథమిక చికిత్స చేశాక ఐసీడీఎస్ అధికారులకు చెప్పడంతో ఖమ్మంలోని శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు. కొణిజర్ల ఎస్‌ఐ జె.శంకరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీఈఓ చాంబర్ ఎదుట టీపీటీఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్‌చేసిన ఉపాధ్యాయులను తిరిగి మాతృస్థానాలకు పంపించడంతో పాటు బాధ్యులైన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం డీఈఓ చాంబర్ ఎదుట ధర్నా చేశారు. ఈమేరకు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ ఇటీవల బదిలీల్లో రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం రిలీవ్ చేయాల్సి ఉండగా కొందరు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. నాయకులు ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావు, ముత్తయ్య, శ్యాంసుందర్, ఆకుల నాగేశ్వరావు, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన లారీ

తల్లాడ: మండలంలోని నూతనకల్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అదుపుతప్పిన లారీ చెట్టును ఢీకొట్టింది. ఖమ్మం వైపు నుండి రాజమండ్రికి ధానిమ్మ కాయల లోడుతో వెళ్తున్న లారీ నూతనకల్ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొనగా, డ్రైవర్ కిందకు దూకి పరారయ్యాడు. అయితే, లారీలో విశ్రాంతి తీసుకుంటున్న రెండో డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోగా రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో గ్రామస్తుల సహకారంతో ఎస్‌ఐ సురేష్ ఆయనను బయటకు తీసి 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,001	4,500
కందులు	10,500	6,300
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	23,600	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	6,950	5,000

– ఖమ్మం వ్యవసాయం

తెగుళ్లతో మిర్చి రైతుల కుదేలు

- జెమినీ వైరస్‌తో తీవ్రంగా పంట నష్టం
- మందులు పిచికారీ చేస్తున్నా కానరాని ఫలితం
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన
- జిల్లాలో 75వేల ఎకరాలకు పైగానే సాగు





తోటలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు, (ఇన్‌సెట్) జెమిని వైరస్ సోకిన మొక్క

కూసుమంచి/తిరుమలాయపాలెం: గత ఏడాది మిర్చికి మెరుగైన ధర లభించడంతో రైతులు ఈసారి మిర్చి సాగుకు మొగ్గు చూపారు. కానీ వాతావరణ పరిస్థితుల నేపథ్యాన పంటకు తెగుళ్లు సోకడం.. రూ.వేలు వెచ్చించి పురుగుల మందులు పిచికారీ చేసినా ఫలితం లేక పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది మిర్చి క్వింటాకు రూ.25వేలకు పైగా ధర పలికింది. దీంతో రైతులు ఈ ఏడాది వ్యయప్రయాసలకు ఓర్చి మిర్చి సాగు చేశారు. కానీ తెగుళ్లు, చీడపీడలతో పరిస్థితులు తారుమారు కావడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది.

పత్తికి బదులు మిర్చి

జిల్లాలో ఈ ఏడాది 75వేలకు పైగా ఎకరాల్లో మిర్చి సాగైనట్లు అధికారిక అంచనా. చాలా మంది రైతులు ఈసారి పత్తిని కాదని మిర్చి వైపు మొగ్గు చూపారు. కానీ వాతావరణ, వర్షాభావ పరిస్థితుల్లో తోటలు ఏపుగా ఎదగలేదు. ఇంతలోనే వైరస్, ఇతరత్రా తెగుళ్లతో పూతకు వచ్చిన పంట దెబ్బతింటోంది. ప్రస్తుతం మిర్చికి జెమినీ వైరస్(బొబ్బ రోగం) సోకగా... మొక్కలు ఎదుగుదల కోల్పోతున్నాయి. ఇంకొన్ని ప్రాంతాల్లో మొక్కలు ఎదిగినా ఆకులు ముడుచుకుపోతుండడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ఆశ చంపుకోలేక అప్పు చేసి మరీ రూ.వేలు వెచ్చించి పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. ఇంకొన్నిచోట్ల ఏపుగా పెరిగిన మొక్కల మొదళ్ల వద్ద బూజులాగా వచ్చి ఎండిపోతున్నాయి. పలువురు రైతులు పురుగుల మందులు పిచికారీ చేస్తుండగా.. పెట్టుబడి భారం భరించలేక తోటలు తొలగిస్తున్నారు.

భారీగా పెట్టుబడి

మిర్చి సాగు అంటేనే పెట్టుబడి పెరుగుతుంది. అయితే, ఈసారి వాతావరణం అనుకూలించకపోవటం, తెగుళ్లు సోకడంతో పెట్టుబడి మరింత పెరిగినట్లయింది.ఇప్పటి వరకు ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు అంచనా. ఇంకా మందులు పిచికారీ చేయాల్సి ఉండడంతో రైతులు కనీసం పెట్టుబడి కూడా వస్తుందో, రాదోనని ఆందోళన చెందున్నారు.

రూ.80వేలు దాటింది..



నేను ఈ ఏడాది ఎకరం మిర్చి తోట సాగుచేశాను. ఈమధ్యే బొబ్బరోగం వచ్చి మంచిగా ఉన్న తోట ఆగమైంది. పురుగు మందులు కొడుతూనే ఉన్నా. ఇప్పటి వరకు రూ.80వేలు పెట్టుబడి వచ్చింది. ఇంకా పెట్టాలి. ఈ సంవత్సరం తోట మొత్తం దెబ్బతిన్నట్లే.

– బోడ బాలాజీ, గంగబండ తండా

మందులు కొట్టినా ఫలితం లేదు



రెండెకరాల్లో మిర్చి సాగు చేసి రూ.వేలల్లో పెట్టుబడి పెడితే పూత, కాతకు వచ్చే దశలో బొబ్బెర తెగులు సోకింది. మందుల షాపుల వాళ్లు చెప్పిన మందులన్నీ పిచికారీ చేసినా ఫలితం లేదు. రోజురోజుకు వైరస్ వ్యాప్తి పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు.

– తురక రాంబాబు, ఎద్దుల్లచెరువు

రైతులకు సలహాలు ఇస్తున్నాం...



వాతావరణ మార్పులతో మిర్చికి తెగుళ్లు, వైరస్ సోకాయి. నాతో పాటు ఏఓలు, ఏఈఓలు తెగుళ్లు వ్యాపించిన తోటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. మందులపై అవగాహన కల్పిస్తున్నాం. పత్రికలు, సోషల్ మీడియా ద్వారా అప్రమత్తం చేస్తున్నాం.

– విజయచంద్ర, ఏడీఏ

అలరించిన ‘పల్సర్ మానియా’



పల్సర్ నూతన మోడల్ మోడల్‌ను ఆవిష్కరిస్తున్న రాజేంద్రప్రసాద్



విన్యాసాలు చేస్తున్న రైడర్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని పెవిలియన్ మైదానంలో వెంకటరమణ బజాజ్ గ్రూప్స్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన పల్సర్ మానియా స్టంట్ షో ఆకట్టుకుంది. పల్సర్ బైక్‌లతో రైడర్లు అబ్బురపరిచే విన్యాసాలు ప్రదర్శించారు. రాష్ట్రంలో మొదటిసారి వెంకటరమణ బజాజ్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ ఉండి రిజిస్ట్రేషన్ చేసుకున్న యువకులకు శిక్షణ నిచ్చి బైక్‌పై స్టంట్స్ చేయించారు. కాగా, స్టంట్ షోను వీవీసీ, వీఆర్‌పీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించడంతో పాటు నూతన పల్సర్ 150 బైక్‌ను తెలంగాణ ఆర్‌ఎం(సేల్స్) సాయిహరితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో స్టంట్ షోలు జరగగా, తెలంగాణలో ఖమ్మంలోనే మొదటి సారి ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వెంకటరమణ బజాజ్ డైరెక్టర్ వంకాయలపాటి వీరేస్‌చౌదరి, ఆర్‌ఎం(సర్వీస్) స్టాలిన్, ఏఎస్‌ఎం అర్జు తదితరులు పాల్గొన్నారు.

ఇలా కూడా చేయొచ్చా ?!



రామాలయం సమీపాన కేసీఆర్ చిత్రం కత్తిరించి వదిలేసిన ఫ్లెక్సీ

సత్తుపల్లి: ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే కోడ్ అమల్లోకి వచ్చేసింది. దీంతో ప్రభుత్వప్రకటన బోర్డులు, హోర్డింగ్‌లను తొలగించడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. కానీ సత్తుపల్లిలో సిబ్బంది కావాలనే చేస్తున్నారో.. లేక నిబంధనల్లోనే అలా ఉందో తెలియదు కానీ వారు వ్యవహరిస్తున్న తీరు అధికార పార్టీకి అనుకూలంగా ఉందనే విమర్శలకు తావిస్తోంది. సత్తుపల్లి పట్టణంలోని రామాలయం సమీపం, పాతపెట్రోల్ బంక్ ఎదురుగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ ప్రచార ఫ్లెక్సీల్లో కేవలం కేసీఆర్ చిత్రపటం వరకు కత్తిరించి వదిలేశారు. దీంతో ఆయా పథకాలకు సంబంధించి వివరాలన్నీ కనిపిస్తున్నాయి. ఫలితంగా వివిధ పార్టీల నాయకులు మున్సిపాలిటీ తీరును తప్పుపడుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఖమ్మం వైద్యవిభాగం: మానసిక ఆరోగ్యంపై ప్రతీఒక్కరు అవగాహన కలిగిఉండాలని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో రంగోలి, మానసిక ఆరోగ్యం మానవ హక్కు అంశంపై పోటీలు నిర్వహించగా విద్యార్థుల స్కిట్లు ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశాక ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిత్యం యోగా, వాకింగ్ చేయడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సౌమ్యా గ్రేస్, కళాశాల సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాళ్లు సరిత, సదానందం, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు

మూడుచోట్ల రూ.7.37లక్షలు స్వాధీనం

ముదిగొండ/నేలకొండపల్లి/ఎర్రుపాలెం: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతోనే కోడ్ అమల్లోకి రాగా, అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముదిగొండలో ఎస్‌ఐ నరేష్, సిబ్బందితో తనిఖీలు చేపట్టగా ఖమ్మం నుంచి గణేష్, హరియాల్ కారులో రూ.3.57లక్షల నగదు హైదరాబాద్ తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే, నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.2.80 లక్షల నగదు పట్టుకున్నారు. ముదిగొండ మండలానికి చెందిన ఓ సర్పంచ్ నగదును బైక్‌పై తీసుకెళ్తుండగా పోలీసులు ఆరా తీశారు. అయితే, జాతీయ రహదారి పనుల కోసం రైతులు మట్టిని విక్రయించగా, కాంట్రాక్టర్ తన ఖాతాలో జమ చేసిన డబ్బును డ్రా చేసి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. కాగా, బ్యాంక్ లావాదేవీల ప్రతాలు చూపించాక నగదు తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు. ఇక ఎర్రుపాలెంలోని గాంధీ సెంటర్‌లో విజయవాడకు చెందిన కొణతం జనార్దన్‌రావు రూ.లక్ష నగదుతో వెళ్తుండగా ఎస్‌ఐ ఎం.సురేష్ గుర్తించారు. ఆయన వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

జోనల్ క్రీడలకు గుండాల గురుకులం సిద్ధం

- 13 నుంచి 15 వరకు క్రీడా పోటీలు
- కలెక్టర్, ఐటీడీఏ పీఓకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికతో భద్రాద్రి జిల్లా కలెక్టర్ తదితరులు

గుండాల: గిరిజన గురుకుల 7వ జోనల్ లెవెల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్–2023–24 నిర్వహణకు గుండాల గిరిజన గురుకుల విద్యాలయం సిద్ధమవుతోంది. బాలురకు నిర్వహించే ఈ క్రీడా పోటీలు ఈ నెల 13న ప్రారంభమై 15న ముగుస్తాయి. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. వారికి భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ఆదేశాలతో జోనల్ క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి హెచ్. డేవిడ్‌రాజ్ వెల్లడించారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి గిరిజన గురుకులాల (18 పాఠశాలలు/కళాశాలలు) నుంచి బాలురు పలు అంశాల్లో పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. కాగా, డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ప్రియాంక ఆల, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌కు క్రీడలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో గుండాల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గుగులోతు హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ విప్పా సత్యనారాయణ, అర్థశాస్త్ర అధ్యాపకుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు సీజ్

కొణిజర్ల: రిజిస్టర్‌లోని స్టాక్ కంటే తక్కువ బియ్యం నిల్వ ఉండడంతో అధికారులు రేషన్ దుకాణాన్ని సీజ్ చేశారు. మండలంలోని చిన్నగోపతి రేషన్ షాపు నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే ఫిర్యాదుతో మంగళవారం ఆర్‌ఐ నరేష్, డీటీ నిస్సార్ తనిఖీ చేశారు. ఈమేరకు స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలతో పోలిస్తే 26 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో రేషన్ దుకాణాన్ని సీజ్ చేసి డీలర్‌పై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో మహిళా రైతు మృతి



రమాదేవి (ఫైల్)

వైరారూరల్: మండలంలోని గన్నవరానికి చెందిన మహిళా రైతు నామాల రమాదేవి(35) గుండెపోటుతో మృతిచెందింది. ఆమె మంగళవారం పత్తి పైరులో పనులు చేస్తుండగా ఒక్కసారిగా కళ్లు తిరిగి కింద పడింది. దీంతో మిగతా రైతులు ఆమెను వైరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మొదట ఆమె పాము కాటుకు గురైందని భావించినా గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. కాగా, రమాదేవికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురం రెవెన్యూ పరిధి వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. ఈమేరకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ నరేష్ చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి ఎడమచేతిపై దుర్గ అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.48 లక్షలు చెల్లించాలంటూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి వినుకొండ మాధవి మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం కాచిరాజగూడెంకు చెందిన గుడిచుట్టు నరేందర్ వద్ద ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్ అల్లాడి శ్రీధర్ 2014 సెప్టెంబర్ 25న రూ.48 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆతర్వాత 2016 సెప్టెంబర్ 23న రూ.48 లక్షలకు చెక్కు జారీ చేసిన అది చెల్లలేదు. దీంతో నరేందర్ తన న్యాయవాది వేగినాటి నాగేశ్వరరావు ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని యాపిల్ సెంటర్‌లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రూ.లక్ష విలువైన నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆటోను ఆపడంతో అందులో ఉన్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి లభించింది. సదరు వ్యక్తి భద్రాది జిల్లా బూర్గంపాడు మండలం మోతేపట్టునగర్‌కు చెందిన టి.కిరణ్‌కుమార్ కాగా, ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మంలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వస్తున్నట్లు నిర్ధారించారు.

రూ.27వేల విలువైన మద్యం...

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో కె.బిక్షంకు చెందిన కిరాణ దుకాణం నుంచి పోలీసులు రూ.27,400 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో మంగళవారం రాత్రి తనిఖీ చేపట్టి మద్యం స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

అభ్యర్థులు ఎవరైనా పార్టీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థులుగా ఎవరిని ప్రకటించినా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలుచేయనున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కాగా, అధికారులు ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాతం చూపొద్దని, బీఆర్‌ఎస్ పార్టీ బోర్డులను తొలగించపోతే తామే తీసేయాల్సి వస్తోందని చెప్పారు. వేల సంఖ్యలో ఉన్న బీఆర్‌ఎస్ పోస్టర్లను వదిలి కాంగ్రెస్ పోస్టర్లకు కేఎంసీ కమిషనర్ రూ.4లక్షల విధించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దొబ్బల సౌజన్య, చోటేబాబా, పాలకుర్తి నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు హామీలతో అందరికీ మేలు



పాదయాత్రలో సుధాకర్, నాయకులు

వేంసూరు: అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలను తమ పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేస్తామని, తద్వారా అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ తెలిపారు. ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం వేంసూరు మండలంలోని చౌడవరం తండా, చౌడవరం, వేంసూరు, మర్లపాడు, లచ్చన్నగూడెం, తాటాకులగూడెం, వెంకటపురం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానికులు ఆయనకు స్వాగతం పలకగా, కాంగ్రెస్ గ్యారంటీలను వివరిస్తూ ముందుకు సాగారు. నాయకులు అట్లూరి సత్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, మైసాక్షి వసంతరావు, గంధ్ర నరోత్తమరెడ్డి, కారుమంచి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12నుంచి పీవైఎల్ రాష్ట్ర మహాసభలు



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర ఎనిమిదో మహాసభలు ఈనెల 12, 13 తేదీలలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్నాయని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆయన మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. సభల్లో భాగంగా 12న మహబూబాబాద్‌లో భారీ ప్రదర్శన ఉంటుందని, మధ్యాహ్నం ఓసీ క్లబ్ ప్రాంగణంలో బహిరంగ సభ, 13న ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా నుంచి యువజనులు భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. పీవైఎల్ నాయకులు రవీందర్, జడ మోహన్‌రావు, రాచబాట్టి రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఏపీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



మున్నేరు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏపీ ప్రభుత్వ విప్ ఉదయభాను

ముదిగొండ: ఏపీలోని పోలంపల్లి మున్నేటి ఆనకట్ట కొట్టుకుపోవడంతో నష్టపోయిన తెలంగాణ రైతులను ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ముదిగొండ మండలం పెద్దమండవ వద్ద వరదకు కొట్టుకుపోయిన పొలాలు, మున్నేరును ఆయన మంగళవారం పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడాక ఆయన పెద్దమండవలో బాధిత రైతులతో సమావేశమయ్యారు. భారీ వర్షాలతో మున్నేటికి వరద రావడంతో బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఆనకట్ట కొట్టుకుపోయిందని, ఫలితంగా పెద్దమండవ గ్రామానికి చెందిన 50ఎకరాల భూమి కోతకు గురైందని రైతులు తెలిపారు. కాగా, గండిని పూడ్చడంతో పాటు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని ఆయన చెప్పారు. అనంతరం ఎన్‌టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో ఉదయభాను ఫోన్‌లో మాట్లాడి వివరాలు వెల్లడించారు. ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్‌తో పాటు వూట్ల నాగేశ్వరరావు, గుంటుపల్లి వాసు, డి.జానకీరామయ్య, రామనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.